క్లుప్తంగా

ఘనంగా హెలన్ కెల్లర్ జయంతి



హెలన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని హెలన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెలెన్ కెల్లర్ 145వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్, ప్రిన్సిపాల్ మసూద బేగం హెలన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బధిర విద్యార్థులు హెలెన్ కెల్లర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇందుకు అర్హులన్నారు. బెంగళూరులో 35 రోజులపాటు ఇచ్చే శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. జులై 1 నుంచి బ్యాచ్ ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌ఓడీలకు పదోన్నతి

కడప అర్బన్: కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో మూడు విభాగాలలో హెచ్‌ఓడీలుగా పనిచేస్తున్న డాక్టర్ రామ్ మనోహర్ (ఆర్థోపెడిక్), డాక్టర్ యాదవేంద్ర రెడ్డి (జనరల్ మెడిసిన్), డాక్టర్ పెంచలయ్య (డీవీఎల్)లను డిప్యూటీ సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా విభాగాల వైద్యులు, వైద్య సిబ్బంది వీరిని అభినందించారు.

ఉర్దూ పీజీ సెట్‌లో ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల(అటానమస్)కు బీఏ(హెచ్‌యూపీ-యూఎం) ఉర్దూ విభాగం విద్యార్థులు ఉర్దూ పీజీ సెట్- 2025 ప్రవేశ పరీక్షలో ప్రతిభచాటి ఉత్తమ ర్యాంకులను సాధించారు. ఇందులో షేక్ ఈసుప్‌బ్బాయిగారి సోఫియా 7వ ర్యాంకు, షేక్ షాజియా 12వ ర్యాంకు, షేక్ జీనత్ 14వ ర్యాంకు, షేక్ సమీరా 25వ ర్యాంకు, షేక్ ముస్తాబ్‌షీరా 38వ ర్యాంకులను సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, ఉర్దూ విభాగాధిపతి షాజియాబేగం, అధ్యాపకురాలు సర్తాజ్ బేగం అభినందించారు.

అబ్బాస్ సేవలు మరువలేం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు అబ్బాస్ ముస్లిం సంక్షేమం కోసం చేసిన సేవలు మరువలేమని ఆప్ కి అవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు. ఆయన మైనార్టీలకు తీరని లోటు అని అన్నారు. సచార్ కమిటీ రంగనాథ్ మిశ్రా మైనార్టీల స్థితిగతులను తెలుసుకొనేందుకు కడప జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు జిల్లాలో ముస్లింల పరిస్థితులను వివరిస్తూ బీసీ కమిషనర్‌కు రిపోర్టు అందించడంలో అబ్బాస్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన మృతికి ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ సంతాపాన్ని వ్యక్తం చేస్తోందని ప్రకటించారు.

నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలియజేసింది. మేధావుల ఫోరం అధ్యక్షులుగా వెల్లాల కుమార్‌రెడ్డి, చేనేత విభాగం అధ్యక్షులుగా రాఘునరసింహారావులను నియమించారు.

ముందస్తు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ శుక్రవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులతో ముందస్తు లోక్ అదాలత్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని మాట్లాడుతూ జూలై 5న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పాల్గొన్నారు.

అన్సర్ బాషా మృతి తీరనిలోటు

ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



అన్సర్ బాషా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ అన్సర్ బాషా మృతి పార్టీకి తీరనిలోటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం రవీంద్రనగర్‌లోని యూఎస్ ఫంక్షన్ హాలులో ఎస్ఆర్‌బి గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన షేక్ అన్సర్ బాషా సంతాప సభలో వారు మాట్లాడుతూ మనిషి ఉన్నప్పుడు వారి విలువ తెలియదన్నారు. అన్సర్‌బాషాకు వైఎస్సాఆర్‌సీపీ అంటే ఎనలేని అభిమానమని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంజద్‌బాషాను గుర్తుచేసుకొని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి నుంచి పార్టీ కోసం పనిచేశారని గుర్తు చేసుకున్నారు. అంతకుముందు అన్సర్‌బాషా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమ బాబు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మహబూబ్ పీర్, డాక్టర్ సొహైల్, కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, షఫీ, షంషీర్, మాజీ కార్పొరేటర్ జమాల్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు గయాజ్, బాబు బాయ్, సుబ్బరాయుడు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ లేదు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ రాజా తదితరులు

కడప రూరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి ఆర్ఎస్ రాజా తెలిపారు. ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జూలై 23వ తేదీన కడప హరిత హోటల్ ఎస్సీ, ఎస్టీల చైతన్య వేదిక సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎస్సీలపై జరుగుతున్న దాడులు, మానభంగాలు, హత్యలను అరికట్టలేకపోవడం పాలకుల చేతకాని తనానికి నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటన జరగడం సిగ్గుచేటన్నారు. ఎదురూరు బాబు, కొట్టం సుబ్బారావు, కే. వెంకటసుబ్బయ్య, ఎం. దేవా, పీ. రెడ్డెయ్య, నాగముని, ఎం. వెంకటరమణ, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో పౌర సేవలు



మెప్మా ఆర్‌పీలు, సీఓలతో ప్రభుత్వ విప్ ఆర్. మాధవి

కడప కార్పొరేషన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పౌర సేవలు పారదర్శకంగా వేగంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ ఆర్. మాధవిరెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు పురపాలక శాఖ ఆధ్వర్యంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత పెంచుతూ, సేవలన్నీ సత్వరంగా అందించేందుకు సాంకేతికను విరివిగా ఉపయోగించడం ద్వారా మహిళలకు నాణ్యమైన సేవలను పారదర్శకంగా, వేగంగా అందించేందుకు ఈ ట్యాబ్‌లు ఉపయోగపడుతాయన్నారు. మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పీలు, సీఓలకు ఏవైనా సమస్యలు వాటి పరిష్కారానికి తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలకు ఆర్ట్స్ కళాశాల వారధి



వెంకటసాయిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) వారధి అని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీజీ సెట్ 2025) ఫలితాలలో ఎం.కామ్ సబ్జెక్ట్ లో కళాశాల విద్యార్థి ఎం. చిన్మయ వెంకట సాయి రాష్ట్రవ్యాప్తంగా మొదటి ర్యాంకును సాధించిందని తెలిపారు. శుక్రవారం వెంకటసాయిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆర్ట్స్ కళాశాలలో చేర్పించి పిల్లల బంగారు భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. రమేష్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్. రామకృష్ణ, వాణిజ్య శాస్త్ర ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య, అధ్యాపకులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ నాగరాజు, శివరాం, రెడ్డి బాషా, రాధిక పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్ల ఫీజు దోపిడీ అరికట్టాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్‌వైఎఫ్) జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డీఈఓ షేక్ షంషుద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాజీపేట మండల పరిధిలో ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు సాయి, వెంకటేష్, మురళి, సుదీర్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డులో అవినీతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మైనార్టీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డులో జరిగిన రూ.6 కోట్ల అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలని ఆల్ ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అలీ షేర్, ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాకీర్ మౌలానా ఎంఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా కోరారు. శుక్రవారం ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో మైనార్టీ ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మైనార్టీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డులలో రూ. 6 కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని అనేక పత్రికలలో ప్రచురితమైందని తెలిపారు. ఈ స్కామ్‌లో పెద్దల హస్తం ఉన్నట్లు అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇన్నొమాటిక్స్‌తో కేఎస్‌ఆర్‌ఎం ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థ ప్రతినిధులు, కేఎస్‌ఆర్‌ఎం ప్రిన్సిపాల్, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: హైదరాబాద్‌కు చెందిన ఇన్నొమాటిక్స్ రీసర్చ్ లాబ్స్ కడపలోని కేఎస్‌ఆర్‌ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (అటానమస్)తో ఓ కీలకమైన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మిషన్ లెర్నింగ్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, పైథాన్, జనరేటివ్ ఏఐ, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), డిజిటల్ మార్కెటింగ్ వంటి ఆధునిక, సాంకేతిక శిక్షణను అందించడం లక్ష్యంగా ఒప్పందం చేసుకున్నట్లు వారు తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో ఇన్నొమాటిక్స్ ఇప్పటికే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ప్రాజెక్ట్ అనుభవం, నిపుణుల మార్గదర్శనం, పరిశ్రమ ఆధారిత శిక్షణ లభించనుందని తెలిపారు. ఈ అవగాహన ఒప్పందం కార్యక్రమంలో కందుల విద్యా సంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఒబుల్ రెడ్డి , ప్రిన్సిపాల్ వి.ఎస్.ఎస్. మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్. ప్రసాద్ , ప్రొఫెసర్ వి. గిరిధర్ (డీన్, ఇండస్ట్రీస్ సెల్) పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని ఫాతిమా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని మైదుకూరు పట్టణం అంకాలమ్మ గుడి వద్ద ఫాతిమా ఆస్పత్రి వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం స్థానిక విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఉప కేంద్రాలు, ఏఈ, డీఈఈ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాల్సిన పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన సమూహాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. అలాగే విద్యుత్ భద్రతకు సంబంధించి ప్రజలకు సూచనలు చేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాల పట్ల చైతన్యవంతులను చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప నగర డీఈఈలు శేషారెడ్డి, లక్ష్మానాయక్, రూరల్ డీఈఈలు వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, ఒంటిమిట్ట డీఈఈ సుబ్రమణ్యం, ఏఈలు పాల్గొన్నారు.

దేశంలో మహిళలకు రక్షణ కరువు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశంలో మహిళలకు రక్షణ కరువైందని పీసీసీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సౌత్ కోల్‌కత్తా లా కాలేజీలో ఆవరణలో విద్యార్థిని అత్యాచారం చేసిన నిందితులన కఠినంగా శిక్షించాలని కోరారు. శాంతిభద్రతల విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పాక్షికంగా విచారణ చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని కోరారు. మహిళలు, విద్యార్థునులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని వారికి ప్రత్యేకమైన రక్షణ కల్పించాలని కోరారు. మహిళల కోసం రూపొందించిన చట్టాలను అమలుచేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూడా మహిళలు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. మహిళల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు.

భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలి

జేసీ అదితిసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ రహదారుల భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియపై శుక్రవారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి సంబంధిత అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షకు వీసీ ద్వారా డీఎఫ్‌ఓ వినీత్ కుమార్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య సంబంధిత రీజియన్ల ఎన్‌హెచ్‌ఏఐ, ఎన్‌హెచ్ పీడీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్న పనులను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ ఎస్డీసీ వెంకటపతి, పీడీ అశోక్ కుమార్, ఆర్-బి నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎన్ హెచ్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ శాఖల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కృష్ణమంత్ర జప మహాయాగం



మాట్లాడుతున్న మాళిగి విద్యానిధి ఆచార్య

కడప సెవెన్‌రోడ్స్ : దశకోటి కృష్ణమంత్ర జప మహాయాగం, సరస్వతీ మహాయాగాలను శని, ఆదివారాల్లో కడప నగరం బ్రాహ్మణవీధిలోని శ్రీ ఉత్తరాధిమఠంలో నిర్వహిస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు మాళిగి విద్యానిధి ఆచార్య తెలిపారు. శుక్రవారం నగరంలోని శ్రీ గురు రాఘవేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణ పరమాత్ముని అనుగ్రహం అందరిపై ప్రసరించాలన్న ఉద్దేశ్యంతోనే లోక కల్యాణార్థం ఈ మహా యాగాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 8.00 గంటలకు గోపూజ, 9.00 గంటలకు పుణ్యాహవాచనము, రుత్విక్ వరణము, 10.00 గంటలకు ప్రధాన దేవతాప్రతిష్టాపన, 11.30 గంటలకు మహా మంగళహారతి ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 7.00 గంటలకు దశకోటి కృష్ణమంత్ర జప మహాయాగం, సరస్వతీమహాయాగం నిర్వహిస్తామన్నారు. భక్తబృందం సభ్యులు నరహరి, గుండారావు, ఆనంద తీర్థ, గౌతమ్, నవీన్, సుదర్శన్, భార్గవ్, కృష్ణారావు, మహిళా మండలి ప్రతినిధులు వేదవతి, లత భట్ పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 200 మంది హాజరు



వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన కౌన్సెలింగ్‌కు జిల్లావ్యాప్తంగా 10,4001వ ర్యాంకు నుంచి 12,0000 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 200 మంది అభ్యర్థులు ఈ కౌన్సెలింగ్‌ను పూర్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, ఛీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఎస్ఆర్ లక్ష్మి ప్రసాద్, వెరిఫికేషన్ ఆఫీసర్లు వసుంధర, మల్లేశ్వరమ్మ, లావణ్య, సిస్టమ్ అడ్మిన్ వీరారెడ్డి, రాజేష్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు..

శనివారం నిర్వహించబోయే కౌన్సెలింగ్‌కు జిల్లావ్యాప్తంగా 12,0001 నుంచి చివరి ర్యాంకు వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

కాళ్లకూరి కమనీయ శిల్పం 'చింతామణి'



మాట్లాడుతున్న జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ఇతివృత్త నిర్మాణం, పాత్రల విశ్లేషణ, సన్నివేశ కల్పన, సంభాషణ చాతుర్యం ఇలా అన్ని కోణాల్లోంచి కాళ్లకూరి నారాయణరావు చింతామణి నాటకాన్ని అద్భుతంగా మలిచారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ లో కాళ్లకూరి నారాయణరావు 98వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సమకాలీన సమాజంలో అనేక సమస్యలను జోడించి రస రమ్యంగా చింతామణి నాటకాన్ని రాశారని, ఈ నాటకం ద్వారా గొప్ప మార్పు వచ్చిందని, కవి ఆశించిన ఫలితం దక్కిందని తెలిపారు. చింతామణి నాటకం ప్రదర్శించిన తొలి రోజుల్లో ఈ నాటకం చూసి కొందరు పడుపు వృత్తి మానుకొన్నారని డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పేర్కొన్నారు. ఇప్పటికీ ఈ నాటకం వేలాది ప్రదర్శనలు నోచుకుందన్నారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారుడు యడవల్లి రామలింగయ్యను ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జీవకళ సత్యనారాయణ, బ్యాంక్ గంగయ్య, రంగస్థల కళాకారులు మందల మురళి, ఏవీఎస్ సత్యనారాయణ, బాల ఓబయ్య, ప్రకాశం, నారాయణ, ప్రకాష్, తబలిస్ట్ గంగయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్టీఆర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి కోరారు. శుక్రవారం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన చేపట్టి ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుకూలంగా కార్మికులకు రూ. 24,500 ఇవ్వాలని కోరారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచుతామని, రూ.25వేలు జీతం ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను విస్మరించారని మండిపడ్డారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై 4 న విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నా ను జయప్రదం చేయాలని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద రావు, నాయకులు కొండయ్య, మహేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలో ఎమర్జెన్సీ మాయని మచ్చ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఎమర్జెన్సీ దేశ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయిందని బీజేపీ నేతలు తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'ఎమర్జెన్సీ డే' సెమినార్‌లో వారు పాల్గొన్నారు. 'అత్యవసర పరిస్థితి-ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ విధించిన చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు' అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భిరం సుబ్బారెడ్డి గారు, మహిళా నాయకులు శారదమ్మ, బీజేపీ కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలోనే ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975 జూన్ 25న ప్రకటించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య ఆత్మపై దాడిలాంటిదన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించి అత్యవసర పరిస్థితిని అమలు చేసి పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, ఆ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం



మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైంది. స్థానిక కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతకుముందు ర్యాంకుల్లో, మెరిట్ లిస్టులో తప్పులున్నాయని కొందరు సెక్రటరీలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో నగరపాలక అధికారులు ఫైనల్ లిస్టు తయారు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ విడుదల చేసిన ర్యాంకులకు, ప్రభుత్వం ఇచ్చిన ర్యాంకులకు తేడాలున్నాయని తెలిపారు. ఎక్కువ మంది అర్హత సాధించేందుకు వీలుగా ప్రభుత్వం 15 మార్కులు కలపడంతో ర్యాంకులు మారిపోయాయన్నారు. పూర్తిగా మెరిట్ లిస్టు ప్రకారమే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, రోస్టర్ ప్రకారం జరపడం లేదన్నారు. అందువల్ల ఎవరికీ అన్యాయం జరిగే ప్రసక్తే ఉండదన్నారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి బదిలీ తప్పనిసరి అని, ప్రభుత్వ నిబంధనలను అనుసరించి స్పౌజ్ కేసులు, మెడికల్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ హిదాయతుల్లా, ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలకమిషనర్లు పాల్గొన్నారు.